
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 4 । అక్టోబర్ । 2025



సోమశిలలో 72.965 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారానికి 72.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 25,205 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,20,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,848
మూడు శాతం జీఎస్టీతో	రూ.11,173
నవర (8 గ్రాములు)	రూ.89,384

గరిష్టం/కనిష్టం 37.8 /27.6

వాతావరణం

జిల్లాలో ఉక్కపోత వాతావరణం శనివారం కొనసాగనుందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 49 శాతంగా శుక్రవారం నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులుగా పలువురి నియామకం


ఆదాల ప్రభాకర్‌రెడ్డి


బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి


కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్ / అల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులుగా జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను గురువారం విడుదల చేసింది.

విద్యుత్ చార్జీల్లో రూ.32.24 కోట్ల తగ్గింపు

- నవంబర్ నుంచి బిల్లుల్లో తగ్గింపు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్సీ) ఆదేశాల మేరకు గతంలో ట్రూఅప్ చార్జీల పేరుతో అదనంగా వసూలు చేసిన రూ.32.24 కోట్లను తిరిగి ట్రూ డౌన్ ద్వారా వినియోగదారుల బిల్లుల్లో తగ్గిస్తామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ రాఘవేంద్రం చెప్పారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లా సర్కిల్ పరిధిలోని ఆత్మకూరు డివిజన్లో రూ.2.25 కోట్లు.. కావలి డివిజన్లో రూ.4.57 కోట్లు.. కోవూరు డివిజన్లో రూ.6.5 కోట్లు.. నెల్లూరు రూరల్ డివిజన్లో రూ.10.80 కోట్లు.. నెల్లూరు టౌన్ డివిజన్లో రూ.8.25 కోట్లను విద్యుత్ బిల్లుల్లో వచ్చే నెల నుంచి తగ్గించనున్నామని వివరించారు. జిల్లా సర్కిల్‌లోని తొమ్మిది లక్షల మంది వినియోగదారులకు మేలు చేకూరనుందన్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. స్వామివారిని 75,188 మంది గురువారం అర్ధరాత్రి వరకు దర్శించుకున్నారు. తలనీలాలను 31,640 మంది భక్తులు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.66 కోట్లను సమర్పించారు. టైమ్‌స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారికి 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారికి మూడు గంటల్లోనే తిరుమలేశుడి దర్శనం లభిస్తోంది. సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



అవగాహన ర్యాలీలో అధికారులు

వెంకటాచలం: రీ సర్వేతో భూ సమస్యలను పరిష్కరించనున్నామని జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ రఘురామరాజు పేర్కొన్నారు. మూడో విడత రీ సర్వేపై మండలంలోని పూడిపర్తిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పొలాల వద్ద ఉండి సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ సూర్యనారాయణ, రీ సర్వే డీటీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి ఉపాధి ఎఫ్‌ఏ తొలగింపు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకుడిగా పనిచేస్తున్న హరికృష్ణను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులను డ్వామా పీడీ గంగాభవానీ జారీ చేశారు. ఇవి మండల పరిషత్ కార్యాలయానికి చేరాయని ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. నర్రవాడ పంచాయతీలో ఉపాధి పథకంలో ఎఫ్‌ఏగా చేరిన హరికృష్ణ తన బంధువులు, గ్రామాల్లో లేని వారి పేర్లతో ఇష్టారాజ్యంగా మస్టర్లు వేసి నిధులను స్వాహా చేశారంటూ జిల్లా అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఏడాది జూన్‌లో విచారణకు డ్వామా ఉన్నతాధికారులు ఆదేశించారు. విచారణ జరిపిన అధికారులు నిధులను స్వాహా చేశారనే అంశాన్ని నిర్ధారించి నివేదికను పీడీకి సమర్పించారు. దీంతో విధుల నుంచి తొలగించడంతో పాటు స్వాహా చేసిన రూ.2.56 లక్షల రికవరీ, క్రిమినల్ కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ పీడీ నుంచి ఉత్తర్వులందాయని ఎంపీడీఓ తెలిపారు.

కట్టుకో.. పైసలిచ్చుకో..!

నెల్లూరు నగరపాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతోంది. ఇక్కడి టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న తీరును చూస్తే విస్మయం కలగకమానదు. జోరుగా అక్రమ నిర్మాణాలు.. నిబంధనలు పాటించని భవన యజమానులు.. అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న కట్టడాలు ఇలా ఒక్కటేంటి.. ఎన్నెన్నో సిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించినా చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

- కల్యాణ మండపం, అపార్ట్‌మెంట్‌పై చర్యలకు హైకోర్టు ఆదేశాలు
- అయినా నేటికీ స్పందన శూన్యం
- ముడుపులు పుచ్చుకొని మిన్నకుండిపోతూ..
- టౌన్‌ప్లానింగ్ శాఖలో ఇదీ దుస్థితి



కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో నిర్మించిన కల్యాణ మండపం



గుప్తా పార్కు సమీపంలో అపార్ట్‌మెంట్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కల్యాణ మండపం, అపార్ట్‌మెంట్‌ను నిర్మించారు. వీటిపై పలుమార్లు కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లభించలేదు. ఈ తరుణంలో హైకోర్టులో ఫిర్యాదు చేయగా, వీటిపై చర్యలు చేపట్టాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినా, నేటికీ ఎలాంటి పురోగతి లేదు.

జరిగిందిదీ..

నగరంలోని డైకస్ రోడ్డు, కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో (42 / 3 సచివాలయ పరిధిలో) ఓ కల్యాణ మండపాన్ని 2023లో ప్రారంభించి, మరుసటి ఏడాదికి అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి ఎంఐహెచ్‌ఎం కన్వెన్షన్ హాల్ అనే పేరును పెట్టారు. వాస్తవానికి దీనికి రెసిడెన్షియల్ కింద గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతి పొందారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా పనిని యజమాని కానిచ్చారు. ప్లాన్‌ను ఒకలా పొంది నిర్మాణాన్ని మరోలా జరిపారు. ఇందులో వంద శాతం డీవియేషన్ సైతం ఉంది. సెల్లార్, గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌ను నిర్మించారు. ఇందులో రెండు కల్యాణ మండపాలున్నాయి. ఈ క్రమంలో దీనికి ఆనుకొని ఉన్న గృహ యజమాని ఈ వ్యవహారమై కార్పొరేషన్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ తరుణంలో కౌంటర్‌ను కార్పొరేషన్ అధికారులు దాఖలు చేశారు.

నోటీసులు బుట్టదాఖలు

నగరపాలక సంస్థ నుంచి నోటీసులను యజమానికి అందజేసినా, స్పందించలేదు. చర్యలకు హైకోర్టు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా, కనీస స్పందన కరువైంది. ఈ తరుణంలో సదరు కల్యాణ మండపంలో శుభకార్యాలు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చి దీన్ని కూల్చేయకుండా టీడీపీ నేత నాగరాజు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అడ్డుకుంటున్నారని సమాచారం.

పన్నూ తక్కువే..

మరోవైపు నిర్మాణంపై చార్జిషీట్‌ను కార్పొరేషన్ అధికారులు దాఖలు చేసి రూ.44 లక్షల జరిమానాను విధించారు. అయినా దీన్నీ చెల్లించలేదు. కమర్షియల్‌గా ఉన్న ఈ కల్యాణ మండపానికి విధించాల్సిన పన్నును సక్రమంగా వేయలేదని సమాచారం. ఫలితంగా కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

అపార్ట్‌మెంట్ తీరూ ఇంతే..

నగరంలోని గుప్తా పార్కు సమీపంలో గల సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో వద్ద ఓ ఆపార్ట్‌మెంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ (జీ +2) అనుమతే దీనికి ఉంది. ప్లాన్ బీఏ నంబర్ 1031 – 1017 – 2023. అయితే జీ + 3గా నిర్మించారు. దీనిపై ఫిర్యాదుదారుడు ఇంతియాజ్ గతేడాది నుంచి ఇప్పటి వరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు, కమిషనర్‌తో పాటు మంత్రి నారాయణకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కరువైంది. హైకోర్టును ఆశ్రయించగా, సదరు అపార్ట్‌మెంట్‌పై చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులను గత నెల్లో జారీ చేశారు. అదనపు ఫ్లోర్.. నాలుగు వైపులా వంద శాతం డీవేయేషన్‌ను తొలగించకుండా ఉండేందుకు ఓ వ్యక్తి ద్వారా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, టీపీఎస్ అధికారులకు పెద్ద మొత్తం అందిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు తానే స్వయంగా అదనపు ఫ్లోర్‌ను తొలగించి డీవియేషన్‌ను ధ్వంసం చేస్తాననీ, దీనికి వారం గడువును సదరు అపార్ట్‌మెంట్ యజమాని కోరారు. ఇది పూర్తయినా నేటికీ అతీగతీ లేదు. దీనిపై కమిషనర్, టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్‌పై హైకోర్టుకు ఫిర్యాదుదారుడు వెళ్లనున్నారని సమాచారం.

చర్యలు చేపడుతున్నాం



కోటమిట్ట షాదీమంజిల్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కల్యాణ మండపాన్ని నిర్మించిన విషయం వాస్తవమే. హైకోర్టు ఆదేశాల మేరకు దీన్ని సీజ్ చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించా. గుప్తా పార్కు సమీపంలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌పై సైతం చర్యలు చేపట్టే పనిలో అధికారులున్నారు.

– నందన్, కమిషనర్, నెల్లూరు కార్పొరేషన్

చంద్రబాబు రైతు ద్రోహి

- ధాన్యాన్ని విక్రయించాక కొనుగోలు కేంద్రాలా..?
- ధ్వజమెత్తిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: తనకెంతో విజన్ ఉందంటూ సీఎం చంద్రబాబు తరచూ చెప్పుకొంటారని.. వరి కోతలు కోసి ధాన్యాన్ని తక్కువ ధరలకే తెగనమ్ముకున్నాక ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని రాజవోలుపాడులో వరి కోతలు పూర్తయిన పొలాలను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. చంద్రబాబు రైతు ద్రోహి అని ధ్వజమెత్తారు. గతేడాది ఇదే సమయంలో ధాన్యం పుట్టి ధర రూ.24 వేల నుంచి రూ.25 వేల వరకు ఉండిందని, అయితే ప్రస్తుతం రూ.15 వేల్లోపే పలుకుతోందని చెప్పారు. అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తూతూమంత్రంగా ప్రస్తావించి చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. అధికార పక్షంలో ఉన్న ఆయన.. సీఎంకు చెప్పి ధాన్యానికి గిట్టుబాటు ధరను ఎందుకు కల్పించలేకపోయారని ప్రశ్నించారు. దళారులకు లాభం చేకూర్చేందుకే.. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

భారీగా ఎగ్గొట్టారు..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 54 లక్షల మందికి రైతు భరోసాను అందించారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం 47 లక్షల మందికే ఇస్తున్నామని చెప్తూ.. మిగిలిన వారికి ఎగ్గొట్టి రైతు సేవా కేంద్రాల చుట్టూ తిప్పుకొంటోందని ఆరోపించారు. యూరియా లభించక రైతులు తీవ్ర ఆవేదనతో ఉన్నారని తెలిపారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే గత ప్రభుత్వ హయాంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ తప్పుడు ప్రచారాన్ని చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా తాను పంటల ధరలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులను అన్ని విధాలా ఆదుకున్న అంశాన్ని ప్రస్తావించారు. నేతలు మోటుపల్లి వెంకటేశ్వర్లు, దాసరి భాస్కర్‌గౌడ్, జెట్టి సురేంద్రరెడ్డి, మందల వెంకటశేషయ్య, ఈగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను నిలిపితే ఊరుకునేదిలేదు

పొదలకూరు: రాజకీయ ఒత్తిళ్లతో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపితే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మొగళ్లూరు, నావూరుపల్లిలో పర్యటించిన ఆయన మాట్లాడారు. నావూరుపల్లికి చెందిన చొప్పా రాజమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను నిలిపివేయడం దారుణమని, ఈ వ్యవహారమై హైకోర్టును ఆమె ఆశ్రయించడంతో బకాయిలతో సహా పింఛన్ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయని వివరించారు. దీంతో ఆమెకు పింఛన్‌ను ఈ నెల ఒకటినే అందజేశారని వివరించారు. అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి.. టీడీపీ నేతల మాటలను నమ్మి పథకాలను నిలిపేస్తే ప్రభుత్వం మారాక విచారణను జరుపుతామని వివరించారు.

అదుపుతప్పిన శాంతిభద్రతలు

సర్వేపల్లి నియోజకవర్గంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని కాకాణి ధ్వజమెత్తారు. మండలంలోని కల్యాణపురంలో శుక్రవారం పర్యటించిన ఆయన నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆయన కుమారుడు బరితెగించి విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమార్జనతో రూ.కోట్లు వెనుకేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. హత్యలు, ఆక్రమణలు, బెదిరింపులు, దాడులు, అక్రమ కేసులు, బ్లాక్‌మెయిలింగ్ తారస్థాయికి చేరాయని విమర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన అక్కెం వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. నేతలు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, వెన్నపూస దయాకర్‌రెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, ఆకుల గంగిరెడ్డి, రావుల ఇంద్రసేన్‌గౌడ్, ఆకుల గణేష్‌రెడ్డి, యనమల శ్రీనివాసులురెడ్డి, చెన్నూరు గంగిరెడ్డి, విజయలక్ష్మి, ఆకుల లక్ష్మి, గాలం వెంగయ్య, రమేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా ఫ్యామిలీ కోర్టు, సెషన్స్ జడ్జి నిఖిత

వెంకటాచలం: తప్పులను మరోసారి చేయకుండా.. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఫ్యామిలీ కోర్టు, సెషన్స్ జడ్జి నిఖిత సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్ద గల జిల్లా కేంద్ర కారాగారంలో గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడారు. చేసిన తప్పులు గతమని, భవిష్యత్తు అనే దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. గాంధీ చూపిన అహింస మార్గం జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది కావాలని సూచించారు. మార్పువైపు అడుగులేస్తూ, జైలు నుంచి బయటకొచ్చాక సత్ప్రవర్తనతో మెలగాలని కాంక్షించారు. అనంతరం ఖైదీలకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కేంద్ర కారాగార సూపరింటెండెంట్ సన్యాసిరావు, జైలర్లు రవిబాబు, శివశంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెస్, క్యారమ్స్ క్రీడాకారుల ఎంపిక నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్పోర్ట్స్ క్యాలెండర్ 2025 – 26 మేరకు ఇంటర్ సర్కిల్ క్యారమ్స్, చెస్ పోటీలను విజయవాడలో ఈ నెల 8 నుంచి పది వరకు ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని ఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, జేఎల్‌ఎం గ్రేడ్ – 2 ఉద్యోగుల సెలక్షన్స్‌ను విద్యుత్ భవన్‌లో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. వివరాలకు 90308 02038, 99512 94829 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



ప్రకాష్, నాగేంద్ర

ముత్తుకూరు(పొదలకూరు): ఒడిశాలో గత నెల తొమ్మిది నుంచి 14 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి టీ – 10 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయికి ముత్తుకూరు యువకులు ప్రకాష్, నాగేంద్ర ఎంపికయ్యారు. థాయ్‌ల్యాండ్‌లో డిసెంబర్ 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఆసియన్ టీ – 10 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని ఏపీ టీ – 10 క్రికెట్ అసోసియేషన్ పీడీలు సుకుమార్, రాంబాబు అభినందించారు.

యోగా పోటీలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి యోగా పోటీలను కలివెలపాళెంలోని రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి 12 వరకు నిర్వహించనున్నామని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది నుంచి 60 ఏళ్లకుపైగా వయస్సు గల వారికి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు విశాఖపట్నంలో ఈ నెల 25, 26న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. వివరాలకు 88856 68752 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్‌ఏలుగా 85 మందికి ఉద్యోగోన్నతి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులను కల్పించారు. జిల్లాలో 87 మంది లాంగ్వేజ్ పండిట్లుగా పనిచేస్తుండగా, వీరిలో 85 మందికి ఉద్యోగోన్నతులను కల్పిస్తూ ఉత్తర్వులను డీఈఓ బాలాజీరావు శుక్రవారం జారీ చేశారు.

సమర్థంగా సాగునీటి వ్యవస్థ నిర్వహణ

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



వివరాలు తెలుసుకుంటున్న హిమాన్షు శుక్లా

నెల్లూరు రూరల్: జిల్లాలో సాగునీటి వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో సాగునీటి నిల్వలు, ఇరిగేషన్ పనులు, మరమ్మతులపై కలెక్టరేట్లోని తన చాంబర్‌లో శుక్రవారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్న నేపథ్యంలో అన్ని మేజర్, మైనర్ చెరువులను 50 శాతానికిపైగా నీటితో నింపాలని సూచించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేస్తామని వెల్లడించారు. కండలేరు, సర్వేపల్లి రిజర్వాయర్ల వద్ద అత్యవసర పనులకు నిధులను కేటాయిస్తామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ స్కీమ్ ద్వారా ఎంపిక చేసిన పనులపై ప్రతిపాదనలను వెంటనే పంపాలని సూచించారు. పంట కాలువలు, చెరువుల్లో గుర్రపు డెక్క, పూడికతీత, రిజర్వాయర్ల వద్ద షట్టర్ల మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, కాలువల బలోపేతానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉద్యాన పంటలు, పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని కోరారు. ఇరిగేషన్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈలు దేశ్‌నాయక్, వెంకటరమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డ్వామా పీడీ గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు అవార్డులు

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండు, జిల్లా స్థాయిలో 48 అవార్డులు లభించాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రజాప్రతినిధులు ఈ నెల ఆరున సత్కరించనున్నారని వివరించారు.

ఆటోడ్రైవర్లకు నగదు జమ నేడు

నెల్లూరు (టౌన్): అర్హులైన ఆటో డ్రైవర్ల ఖాతాల్లో నగదును శనివారం జమ చేయనున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వీరికి డబ్బులిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పంగనామం పెట్టింది. రెండో సంవత్సరంలో పథకాన్ని అమలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. జిల్లాలోని 17,406 మంది లబ్ధిదారులకు రూ.15 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. నెల్లూరు అర్బన్‌లో 1821.. నెల్లూరు రూరల్‌లో 3441.. కోవూరులో 2585.. సర్వేపల్లిలో 2651.. కావలిలో 1888.. ఉదయగిరిలో 1406.. కందుకూరులో 1004, వెంకటగిరిలో 974 (మూడు మండలాలు) మంది అందుకోనున్నారు. జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో పథకాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు.

దసరా సంబరం

దసరా సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసి ఊరేగింపు నిర్వహించారు. పురమందిరం వద్ద ఉన్న వినాయకుని గుడిలో వాహనాలకు పెద్ద ఎత్తున పూజలు చేయించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



హాజరైన భక్తులు



నెల్లూరు : ప్రత్యేకాలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు



పులివాహనంపై కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



పురమందిరం వద్ద వినాయకుడి ఆలయంలో వాహనాలకు పూజలు



ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



విచ్చేసిన అతిథులు

నెల్లూరు(బృందావనం): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలో గురువారం గుంటబడి మైదానంలో ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి మహోత్సవం వేడుకగా సాగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు విచ్చేసి మాట్లాడారు. దేశ ఐక్యతలో ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన పాత్ర ఎనలేనిదిగా వివరించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నగరంలో ప్రదర్శన చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్ చాలక్ బయ్యా రవికుమార్, చిన్నబజార్ ఉపనగర కార్యవాహ పనబాక నరేంద్ర, స్వయంసేవకులు, మాతృమూర్తులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన అతివేగం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఒకచోట టీచర్, మరోచోట వృద్ధురాలు మృతిచెందారు.

బైక్‌పై వెళ్తుండగా..



వై.అశోక్ (ఫైల్)

కందుకూరు రూరల్: కారు ఢీకొని ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కందుకూరు పట్టణం సాయినగర్‌లో నివాసముంటున్న వై.అశోక్‌కుమార్ వలేటివారిపాలెం చుండి మోడల్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నాడు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. త్వరలో జరగబోయే ధర్నాకు ఉలవపాడు మండలంలోని ఉపాధ్యాయులను సమాయత్తం చేసేందుకు ఆయన కందుకూరు నుంచి ఉలవపాడుకు బైకుపై బయలుదేరారు. ఓగూరు సమీపంలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాల వరకు రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. అశోక్‌కుమార్ (45) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా కారులోని నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన స్వగ్రామం కందుకూరు మండలంలోని పలుకూరు.

కారు ఢీకొని..



అక్కమ్మ మృతదేహం

వలేటివారిపాలెం: కారు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని చుండి – అయ్యవారిపల్లి గ్రామాల సమీపంలో శుక్రవారం జరిగింది. ఎస్సై మదిరి నాయుడు కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్రం అక్కమ్మ (70) అనే వృద్ధురాలు గ్రామ శివారులోని సింగరాయకొండ – మైదుకూరు ప్రధాన రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆమె గాయపడింది. స్థానికులు ఆస్పత్రికి తరలించే లోపే మరణించింది. అక్కమ్మకు ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులున్నారు. భర్త గతంలోనే మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై అనుమానంతో..

- ఉరేసుకుని భర్త ఆత్మహత్య

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి జరిగింది. కొండాపురం ఎస్సై జె.మాల్యాద్రి కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారు సుధాకర్ (51)కు వివాహమైంది. ఇద్దరు కుమారులున్నారు. గ్రామంలోని ఓ యువకుడితో భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీల ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కావలి ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కాకాణి మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధన కోసం పనిచేద్దామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బ్రిటిష్ వలస పాలకుల కంటే దారుణంగా, ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెడుతూ, ఉక్కుపాదంతో అణచి వేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. అక్రమ కేసులు, వేధింపులు సర్వసాధారణమయ్యాయని, ప్రభుత్వ పాలన మహనీయుల సిద్ధాంతాలకు విఘాతం కలిగించే విధంగా ఉండటం దురదృష్టకరమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గాంధీజీ కలలు సాకారం చేసేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి నిరవధిక సమ్మె



పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న చలో తిరుపతి సీఎండీ కార్యాలయం, 15వ తేదీన నిరవధిక సమ్మె చేస్తామని ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు జేఏసీ యాక్షన్ కమిటీ నాయకుడు షేక్ అల్తాఫ్ తెలిపారు. జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని దర్గామిట్టలోని ఏపీఎస్పీడీసీఎల్ అతిథి భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల్ని యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, దామోదర్, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, హజరత్‌వలీ, కృష్ణ, ప్రసాద్, పతంజలి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



సీఐకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న గీతాంజలి మృతిపై విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సీఐ రోశయ్యకు వినతిపత్రం అందజేశారు. వైద్య విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలని, ఆత్మస్థైర్యం పెంపొందించేలా మోటివేషన్ క్లాసులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంగమూరు ఆశ్రిత్ రెడ్డి, నగర అధ్యక్షుడు ఎండీ తౌఫిక్, రూరల్ అధ్యక్షుడు రోహిత్, నాయకులు చంద్ర, శరత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు

- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



మాట్లాడుతున్న హేనాసుజన్

నెల్లూరు(పొగతోట): 'జిల్లా పరిషత్ నుంచి 15 శాతం నిధులు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు మంజూరయ్యాయి. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి' అని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆదేశించారు. శుక్రవారం నెల్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె సీడీపీఓలతో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో పౌష్టికాహారం నాణ్యతగా లేకుంటే సమాచారం ఇవ్వాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పిల్లలు బరువు, ఎత్తు పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యకర్తలకు సంబంధించి రిటైర్మెంట్, మరణించిన అనంతరం వచ్చే బెనిఫిట్స్ పెండింగ్ ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్రాల్లో ఉండే బాలలకు సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో నీతి ఆయోగ్ ద్వారా ఎంపికైన కేంద్రాల పరిశీలనకు అధికారులు వస్తారన్నారు.

కాలం తీరిన కూల్‌డ్రింక్‌పై ప్రశ్నించినందుకు..

- మహిళపై దాడి




గాయపడిన కోటమ్మ

మనుబోలు: ఓ దుకాణ యజమాని తనపై దాడి చేసి గాయపరిచాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన ఓ మహిళ శుక్రవారం తహసీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేసింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆశా వర్కర్ పారిచర్ల కోటమ్మ గతనెల 27వ తేదీన తన మనుమడు ధనుష్‌ను దుకాణానికి వెళ్లి కూల్‌డ్రింక్ తీసుకురావాలని చెప్పింది. అతను పడాల రాధయ్య దుకాణానికి వెళ్లి మాజా బాటిల్ తెచ్చాడు. దాన్ని తెరవగా వాసన వచ్చింది. పరిశీలించగా కాలం తీరిపోయినట్లు తెలిసింది. కోటమ్మ దుకాణానికి వెళ్లి డబ్బు తిరిగివ్వాలని కోరింది. ఆగ్రహించిన యజమాని రాధయ్య ఆమెపై కర్రతో దాడి చేశాడు. బాధితురాలు అదేరోజు మనుబోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే వారు ఇంత వరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతోపాటు దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోలేదు. దీంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బీసీ భాస్కర్ పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.133
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.238
స్కిన్‌లెస్ చికెన్:	రూ.262
లేయర్ చికెన్:	రూ.187



కండలేరులో 57.990 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 57.990 టీఎంసీలున్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 160, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

డైమండ్ డబ్బా నిర్వహణపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లిలో డైమండ్ డబ్బా నిర్వహణకు సంబంధించి వెంకటాచలం పోలీసులు గురువారం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా అనికేపల్లి గ్రామదేవత ఆలయం వద్ద మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు డైమండ్ డబ్బా నిర్వహించారు. యువకులు నగదు పోగొట్టుకున్నారు. దీనిపై సాక్షిలో 2వ తేదీన కథనం ప్రచురితమైంది. జూదంపై ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశించారు. వెంకటాచలం పోలీసులు అనికేపల్లి గ్రామానికి చెందిన పుట్టా ప్రభాకర్, పర్వతాల శివప్రసాద్, యనమల ప్రభాకర్, నాసిన శ్రీనివాసులు, తోటపల్లి గూడూరు మండలం ముంగలదొరువు గ్రామానికి చెందిన నాగరాజాపై కేసు నమోదు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఆనం అరుణమ్మ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరుణమ్మ

నెల్లూరు రూరల్: కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆయన కార్యాలయంలో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

- కడప కేంద్ర కారాగారానికి తరలింపు

నెల్లూరు(క్రైమ్): పదేపదే నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ గోని రాముపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు వెంకటేశ్వరపురం అంబేడ్కర్ కాలనీకి చెందిన రాము నేరాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లినా మారలేదు. ప్రస్తుతం ఉడ్‌హౌస్ సంఘంలో ఉంటున్నాడు. అతడిపై రెండు హత్య, ఆరు హత్యాయత్నం, రెండు దారిదోపిడీ, రెండు దొంగతనం, మూడు దాడి కేసులున్నాయి. నవాబుపేట పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. పలుమార్లు పోలీసులు కౌన్సెలింగ్ చేసినా మార్పురాలేదు. దీంతో పీడీ యాక్ట్ ప్రయోగించారు. ప్రస్తుతం రాము జిల్లా కేంద్రకారాగారంలో ఓ కేసులో రిమాండ్‌లో ఉండగా నవాబుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం తెల్లవారుజామున కడప కేంద్ర కారాగారానికి తరలించారు. గతంలో రాము పెయింట్ పనులు చేసేవాడు.

- ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ అజిత శుక్రవారం హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే పోలీసు అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మినీ లారీ దగ్ధం



మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు కరెంటాఫీసులోని స్పెషల్ పవర్ మెయింటెనెన్స్ (ఎస్‌పీఎం) విభాగంలో శుక్రవారం సాయంత్రం మినీ లారీలో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కార్యాలయ సిబ్బంది అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఏడీఎఫ్ఓ పి.శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు సిబ్బంది తెలిపారు.

పొదలకూరు నిమ్మ ధరలు(కిలోలలో)

పెద్దవి:	రూ.35
సన్నవి:	రూ.20
పండ్లు:	రూ.10

